క్లుప్తంగా

నవ్వులు పంచిన 'వినోదాల విందు'


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నిర్వహించిన 'వినోదాల విందు' కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పూయించింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం కళాకారులు ఉత్సాహంగా పాల్గొని పలు కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వీటిలో డ్రైవర్ ఉద్యోగం, పండగకి వస్తా, నైటీ, 6 నెలలు, పెళ్లాం కంట్రోల్, పక్కింటి ఆంజనేయులు, పెళ్లి చూపులు, దెయ్యాలు, ఫ్రిజ్ స్కిట్స్ ఆహూతులను అలరించాయి. కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, అడవి రాజు, భాను, రాజు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, శంకర్ స్కిట్స్ ప్రదర్శించారు. అనంతరం కళాకారులను నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, డి.నాగరాజారావు సత్కరించారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పాత్ర కీలకం


ఎస్వీ రామారావును సత్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట : ప్రభావితమైన సినిమాలు ప్రేక్షకులకు చేరువ చేయడంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పాత్ర ఎంతో ఉందని ప్రముఖ రచయిత ఎస్వీ రామారావు అన్నారు. బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ విదేశీ భాషల్లో రూపొందిన సందేశాత్మక, సాంప్రదాయ, సాంస్కృతిక చిత్రాలను, విశేష ఆదరణ పొందిన చిత్రాలను విశాఖ ప్రజల కోసం ఫిల్మ్ సొసైటీ ప్రదర్శించిందన్నారు. సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 2003లో సంస్థను స్థాపించి 21 సంవత్సరాలుగా అనేక ఫిల్మ్ ఫెస్టివల్స్, ప్రముఖ దర్శకులు, టెక్నీషియన్లతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సొసైటీ సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, ఉపాధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి ఆర్.శివకుమార్, కార్య వర్గ సభ్యుడు బి.గణేశ్వర బాబ్జి పాల్గొని సొసైటీ తరఫున ఎస్వీ రామారావును సత్కరించారు.

మహిళకు అంత్యక్రియలు చేసిన యువసేవ ఫౌండేషన్


అంత్యక్రియలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

తాటిచెట్లపాలెం : అనారోగ్యంతో మృతిచెందిన మహిళకు యువ సేవ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కైలాసపురం దరి కస్తూరినగర్ – 1లో కుమారుడు సాయి (12)తో కలిసి తల్లి వద్ద గాయత్రి నివసించేవారు. ఆమె భర్త సూరిబాబు కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అప్పటి నుంచి కేటరింగ్ పనులు చేస్తూ గాయత్రి కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఆమె కూడా రెండేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువ సేవ ఫౌండేషన్ ప్రతినిధులు పీలా హరిప్రసాద్ స్థానిక వలంటీర్లు లోకేష్, ప్రసన్నకుమార్, కంచరపాలెం పోలీసుల పర్యవేక్షణలో ఆమె అంత్యక్రియలు పూర్తి చేశారు.

మహిళలకో గ్రంథాలయం


చిన్నారుల చిత్రలేఖనోత్సాహం


గ్రంథాలయంలో విద్యార్థులు

- మురళీనగర్‌లో రోజురోజుకీ అభివృద్ధి
- 2,672 మందికి సభ్యత్వం


గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

మురళీనగర్ : జిల్లాలోనే మహిళలకు ఏకైక గ్రంథాలయంగా పేరు పొందిన మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయం స్త్రీలలో చైతన్యానికి, జీవన నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేస్తోంది. జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 67 గ్రంథాలయాలు ఉండగా మురళీనగర్‌లో ప్రత్యేకంగా మహిళలు, పిల్లల కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సాధారణంగా మహిళలు, పిల్లలు ప్రత్యేకంగా గ్రంథాలయానికి రావడానికి వెనుకడుగు వేస్తారు. వారిలో పఠనాశక్తిని పెంపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారా చైతన్యవంతుల్ని చేయడం ఆశయంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ గ్రంథాలయాధికారిణి కూడా మహిళనే నియమించారు. మురళీనగర్ మహిళలు సద్వినియోగం చేసుకుంటూనే గ్రంథాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారు.

పెరుగుతున్న సభ్యత్వాలు

ఈ గ్రంథాలయాన్ని గ్రంథాలయ ఉద్యమకర్త, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు దివంగత గుల్లిపల్లి సింహాద్రప్పడు మాస్టారు కృషి మేరకు మురళీనగర్‌లో ఏర్పాటు చేశారు. ప్రారంభంలో 300 మంది మాత్రమే సభ్యులుగా ఉండగా ఇప్పుడు 2,672 మంది ఉన్నారు. వీరిలో మహిళలు 1285 కాగా, పిల్లలు 561 మంది, పురుషులు 830 మంది ఉన్నారు. రోజూ కనీసం 90 మంది గ్రంథాలయానికి పఠనం, అధ్యయనం కోసం వస్తుంటారు. ఈ గ్రంథాలయం అభివృద్ధిలో వనితా వాకర్స్, మహిళా వాకర్స్ మహిళలు, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్, వాకర్స్ క్లబ్ సభ్యులు తోడ్పాటు అందిస్తున్నారు.

అందుబాటులో 13 వేల పుస్తకాలు

విజ్ఞాన సముపార్జనకు అవసరమైన పుస్తకాలు, గ్రంథాలు ఇక్కడ లభిస్తున్నాయి. 13,676 పుస్తకాలు ఉండగా వీటిలో తెలుగు భాషలో 10,668, ఇంగ్లిష్‌లో 2,051, ఉర్దూలో 43, ఇతర భాషలకు సంబంధించి 7 పుస్తకాలు, గ్రంథాలు ఉన్నాయి. 5 తెలుగు దిన పత్రికలు, 3 ఇంగ్లిష్ పత్రికలు అందుబాటులో ఉన్నాయి. స్వాతి, ఎంప్లాయిమెంట్ న్యూస్ వార పత్రికలున్నాయి. పక్షపత్రిక విజేత కాంపిటీషన్, మంత్లీ పత్రికలు 8 ఉన్నాయి. వీటిలో 5 తెలుగు, 3 ఇంగ్లిష్ పుస్తకాలున్నాయి. తెలుగులో సైన్స్ ఇండియా, వివేక్, యోజన, గృహ శోభ, గ్రంథాలయ సర్వస్వం, ఇంగ్లిష్‌లో సీఎస్ఆర్ జీకే, బ్యాంకింగ్ సర్వీసెస్ క్రానికల్, కరంట్ అఫైర్స్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

మహిళలు, బాలలకు ప్రత్యేకం

మహిళల కోసం ప్రత్యేకంగా సాహస మహిళలు, పురాణ ప్రాధాన్యత కలిగిన స్త్రీల గాథలు, ఇతిహాసాలు, వంటల పుస్తకాలు, ఫ్యాషన్ డిజైనింగ్, మానసిక శాస్త్రం, ఇంటింటి చిట్కా వైద్యం, హోమియో, ఆయుర్వేద వైద్యం, మహిళల ఆరోగ్య రక్షణకు సంబంధించిన పుస్తకాలు, జీవన నైపుణ్యాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. బాల బాలికల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. పిల్లల్ని ఆకర్షించి, వారిలో నైతిక విలువలు పెంపొందించే ఎన్నో పుస్తకాలు, పత్రికలు తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంచారు. ఇండోర్ గేమ్స్‌కు అవకాశం ఉంది. చెస్, లూడో, స్నేక్ అండ్ ల్యాడర్, పజిల్స్, వర్డ్ మేకింగ్ వంటి ఆటలు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి 15 రకాల పత్రికలు, 2 వేల పుస్తకాలు ఉన్నాయి. గ్రంథాలయాన్ని రోజూ ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు తెరిచి ఉంచుతున్నారు. ప్రతీ శుక్రవారం, రెండో శనివారం సెలవు పాటిస్తున్నారు.


ఇండోర్ గేమ్ ఆడుతున్న పాఠకులు

డిమాండ్ ప్రకారం పుస్తకాలు



పాఠకుల సభ్యత్వాల నమోదుకు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహిస్తున్నాం. పెద్దల నుంచి రూ.200, పిల్లల నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లిన వారు రెండు వారాలు తర్వాత అప్పగించాలి. రాజారామ్‌మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ నుంచి పుస్తకాలు అందిస్తారు. రీడర్ ఆన్ డిమాండ్ బుక్స్ తెచ్చి అందుబాటులో ఉంచుతున్నాం.

– వై.పద్మజ, గ్రంథాలయాధికారి

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా



ఎస్ఐ పోస్టుకు ప్రిపేర్ అయ్యాను. లైబ్రరీలో ఇందుకు అవసరమైన పుస్తకాలు ఉన్నాయి. కాంపిటీటివ్ పరీక్షలకు చదువుతున్న వారికి పేపర్ సెక్షన్ రూము ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరిచి ఉంటుంది. రోజూ ఉదయం 9 గంటలకు వస్తాను. సాయంత్రం వరకు ఇక్కడే ఉండి చదువుకుంటాను. పరీక్ష బాగా రాశాను. ఇదే కాకుండా ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీకి కూడా ప్రిపేర్ అవుతున్నా.

– బి.రాజ్యలక్ష్మి, మాధవధార

ఈఎస్ఐసీలో ఉద్యోగం సాధించా



డిగ్రీ చదువుతున్నప్పటి నుంచి లైబ్రరీకి రోజూ వచ్చేదాన్ని. కాలేజీ అయిపోయిన వెంటనే ఇక్కడికి వచ్చి చదువుకునేదాన్ని. ఆదివారం రోజంతా ఇక్కడే ఉండి పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యాను. దీని వల్ల ఈఎస్ఐసీ కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం సాధించాను. గ్రంథాలయం నాకు చాలా ఉపయోగపడింది. కోచింగ్‌కు వెళ్లకుండా గ్రంథాలయంలో పఠనం ద్వారా ఉద్యోగం సాధించాను.

– ఎ.అపర్ణ, మురళీనగర్

నవరాత్రి ఉత్సవాల మండపాలు పరిశీలన


మండపం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ రమణ

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న మండపాలను ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డీవీ రమణ ఆదివారం పరిశీలించారు. జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లోని లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపాన్ని ఆయన సందర్శించారు. నిర్వాహకులు పోలీసు శాఖ నిబంధనలు పాటిస్తున్నారా..? లేదా..? అని పరిశీలించారు. అనంతరం కమిటీ సభ్యులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చుట్టుపక్కల ప్రజలకు, ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. మండపాలు వద్ద మైక్ సెట్ ఉదయం 6 గంటల నుంచి రాత్రి పది వరకు తక్కువ సౌండ్‌తో వినియోగించాలన్నారు. పెద్ద పెద్ద శబ్దాలతో చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. డీజే, బాణసంచా వినియోగం మీద నిషేధం వుందన్నారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండపం వద్ద పాయింట్ బుక్ ఉంచితే తనిఖీలకు వచ్చే బీట్ కానిస్టేబుల్ అందులో సంతకాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుప్తాజీ, మురళి, అశోక్ రెడ్డి, జగదీష్, చిన్న, రమణమూర్తి, జె.కె.రాజు, చంటి, శంకర్, సూరేశ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగకుంటే కఠిన చర్యలు

- ఫోర్త్ టౌన్, ద్వారకా స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ విజయకుమార్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డీవీ రమణ

సీతమ్మధార : సమాజంలో సత్ప్రవర్తనతో మెలగకుండా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డి.వి. రమణ హెచ్చరించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి ముద్రలు, సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ రమణ మాట్లాడుతూ ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలు, అల్లర్లలో తలదూర్చితే నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని, ఎవరినైనా బెదిరించినా, దుర్గా దేవి మండపాల వద్ద గొడవలకు దిగినా సహించేది లేదన్నారు. రౌడీషీటర్లు హద్దు మీరితే నగర బహిష్కరణ చేస్తామని, గతంలోనూ అలా చేశామని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, ఏఎస్ఐ గంగాధర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో...

తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని ఫోర్త్ టౌన్ సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లుకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెట్ల కొమ్మలు కొట్టి వదిలేశారంతే..


శ్రీదేవి పార్కు సమీపంలో చెట్ల కొమ్మలు


సెక్టార్ - 11లో వారం రోజులుగా తొలగించని చెట్ల కొమ్మలు

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ఇటీవల విద్యుత్ శాఖ ఫీడర్లు, కండక్టర్ల నిర్వహణ పనుల్లో భాగంగా తొలగించిన చెట్ల కొమ్మలను ఎక్కడివి అక్కడే వదిలేశారు. సెక్టార్ – 3, సెక్టార్ – 11 ప్రాంతాల్లోని శ్రీదేవి పార్కు, బృందావన్ పార్కు సమీపంలో చెట్ల కొమ్మలు, చెత్తను అలాగే వదిలేశారు. వారం రోజులైనా వీటిని తరలించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అటు విద్యుత్ శాఖ, ఇటు జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదని... వీటిలో విష పురుగులు చేరడంతో భయంకరంగా ఉందని పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాకర్స్ పార్కు గోడ వద్ద కూడా చెత్త పేరుకుపోయినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోర్టు నిధులతో ఆస్పత్రి నిర్వహించాలి



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో నాయకులు

తాటిచెట్లపాలెం : సాలగ్రామపురంలోని విశాఖపట్నం పోర్టు అథారిటీ హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆరో రోజుకు చేరాయి.

ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ ప్రకటించిన విధంగా పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లాభాల్లో నడుస్తున్న పోర్టు నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు నాయకులు జెసత్యనారాయణ, త్రినాథ్, శంకర్రావు, జేడీ లక్ష్మి, నర్సింగరావు, ఈశ్వర్రావు, నాయుడు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీ నమోస్తుతే

- నేత్రపర్వంగా శరన్నవరాత్రి మహోత్సవాలు


శ్రీలలితాపీఠంలో మహా సౌర అరుణ హోమం


శ్రీ లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు


శ్రీమహాలక్ష్మిగా లలితాంబికాదేవి


రేణుకా పరమేశ్వరిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి


లలితా త్రిపుర సుందరిగా భూలోకమాత


లలితాపీఠంలో శ్రీచక్రానికి పూజలు

సీతంపేట: దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం లలితా త్రిపుర సుందరి అలంకారం కావడంతో అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠానికి భక్తులు పోటెత్తారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలలు, బంగారు ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. పీఠం దర్బారు హాల్లో మహా సౌర అరుణ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, అమ్మవారి సన్నిధిలో మణిద్వీపంలో శ్రీచక్రనవావరణ జరిపారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా అమ్మవారికి సామూహిక లలితా సహస్ర నామ కుంకుమార్చన చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు పీఠంలో వారాహిదేవి హోమం, లలితాదేవి హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

➡ స్థానిక సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి ఆదివారం లలితా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కరశర్మ పూజలు జరిపారు.

లలిత త్రిపురసుందరిగా భూలోకమాత

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ భూలోకమాత అమ్మవారి ఆలయంలో గ్రామ సేవాసంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు సోమవారం శ్రీమహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. రోజూ అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకారం, జలాభిషేకం, హోమం, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

మురళీనగర్ : మురళీనగర్ రామాలయం ఆవరణలో వెలసిన లలితాంబికా దేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకుడు భోగాపురపు ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సహస్ర కుంకుమార్చన చేశారు. శ్రీనాట్య రసజ్ఞ స్కూల్ ఆఫ్ ప్లాన్స్ అకాడమీ హర్షలత బృందం ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్, కోశాధికారి శ్రీనివాస్, ఈవెంట్ నిర్వాహకుడు జీవీ ఆనందరావు, పి.రామరాజు, విజయలక్ష్మి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేణుకా పరమేశ్వరిగా దుర్గాదేవి అమ్మవారు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీ మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రేణుకా పరమేశ్వరి అవతారంలో గల అమ్మవారికి పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు రోజూ అన్నదానం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో శివాలయం కమిటీ నిర్వహిస్తున్న దుర్గా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పోతు సత్యనారాయణ, నాగమణి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కొత్తూరు శ్రీనివాసరావు, కాళ్ల ప్రకాష్, పాండవ ఈశ్వరరావు, పాండవ శ్రీనివాసరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్నగార్డెన్స్‌లో కొలువైన శ్రీ కనక మహాలక్ష్మి, గాయత్రీదేవి, కనక దుర్గా దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సాగరగిరికి పోటెత్తిన భక్తజనం


దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

- సౌకర్యాల లేమితో భక్తులకు అవస్థలు
- బోటు కోసం గంటల కొద్దీ నిరీక్షణ

అల్లిపురం : శరన్నవరాత్రి ఉత్సవాలతోపాటు ఆదివారం కావడంతో సాగరగిరి కనకదుర్గమ్మ గుడికి భక్తులు పోటెత్తారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు పాత పోస్టాఫీస్ దరి పోర్టు వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద బోటు ప్రయాణం నిమిత్తం బారులు తీరారు. రద్దీకి తగ్గట్టు నిర్వాహకులు బోట్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కనీసం టెంట్ సౌకర్యం కూడా లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఒక పక్క ఎండ తీవ్రత, ఉక్కపోతతో దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారు అవస్థలు పడ్డారు. తీరా బోటు మీద అవతలి ఒడ్డుకు చేరుకున్న తర్వాత కొండపైకి వెళ్లిన వారికి తాగునీరు, వాడుక నీరు లేక ఇబ్బందులు పడ్డారు. కనీసం అక్కడ పట్టించుకునే వారు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది తరలి వస్తారని పలువురు అభిప్రాయపడ్డారు.



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాగరగిరి కనక దుర్గమ్మ ఆదివారం భువనేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

4 కేజీల గంజాయి స్వాధీనం

మద్దిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం కంచరపాలెం ఆర్‌పీ పేట బ్రిడ్జి కింద కేరళకు చెందిన పరియరుతు పర్చిల్ సుజిత్, అర్జున్ తొప్పిల్ ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్టు కంచరపాలెం పోలీసులు తెలిపారు.